హద్దు.. దాటనివ్వదు!



బోటుకు బిగిస్తున్న యంత్రం

సముద్రంలో మత్స్యకారుల రక్షణకో మిషన్

ప్రస్తుతం చాలా మంది తండేల్ సినిమా చూసే ఉంటారు.. ఆ సినిమాలో హీరో టీమ్ వేటకు వెళ్లి సముద్రంలో అనుకోకుండా పాకిస్థాన్ సరిహద్దుల్లోకి వెళ్లిపోతారు..ఆ జైలులో మగ్గిపోతారు.. చివరు హీరోయిన్ పోరాడి వారి ని విడిపిస్తుంది.. ఇది రియల్ స్టోరీగా డైరెక్టర్ కథనం.. ఇది నిజమే..ఎందుకంటే సముద్రంలో సరిహద్దులు దాటితే ప్రమాదమే.. అటువంటి ప్రమాదాల నుంచి మత్స్యకారులను తప్పించ డానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌పాండర్ అనే యంత్రాన్ని బోట్లకు బిగిస్తున్నాయి.



(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు అనేక మంది పొరపాటున పొరుగు దేశాల్లోకి వెళ్లి జైలు పాలవుతున్నారు. తెలియకుండా చేసిన తప్పునకు ఏళ్లకు ఏళ్లు ఆయా దేశాల జైళ్లలో మగ్గుతున్నారు. ఇకపై మత్స్యకారులకు ఆ బాధలు తప్పనున్నాయి. సముద్రంలో వేటాడుతున్న బోటు పొరుగు దేశాల సరిహద్దుల్లో అడుగుపెట్టే ప్రమాదం ఉంటే కిలోమీటరు దూరంలో ఉండగానే ఒక యంత్రం హెచ్చ రిస్తుంది. ఆ యంత్రా లను ఇప్పుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మత్స్యకారుల బోట్లకు అధికారులు బిగిస్తున్నా రు. రూ.21 వేల విలువైన ఒక్కో యంత్రాన్ని మత్స్యశాఖ ఉచితంగా ఇస్తోంది.కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిధులను భరించి మత్స్యకారులకు ఇస్తుండగా బిగింపు ముమ్మరమైంది.

హద్దు దాటితే జైలే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 67 వేల కుటుంబాలకు పైగా చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఇందులో 48 వేల కుటుంబాలు వరకు సముద్రంలో చేపల వేట ద్వారా బతుకు తున్నారు. వీరిలో అనేక మంది మత్స్యకారులు మెకనైజ్డ్ బోట్లపై వారాల తరబడి చెన్నై, ముం బై, గుజరాత్, ఒడిషా తదితర రాష్ట్రాల సముద్ర జలాల్లో ప్రయాణించి చేపల వేట సాగిస్తారు. ఈ క్రమంలో అనేక మంది మత్స్యకారులు తెలి యకుండా పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక దేశాల సముద్ర జలాల్లోకి ప్రవేశిస్తున్నారు. దీంతో అక్కడ పోలీసులకు పట్టుబడి ఏళ్ల తరబడి ఆయా దేశాల జైళ్లలో మగ్గిపోతున్నారు.అటు వీరిని విడిపించడం సైతం కేంద్ర ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారిపోతోంది.2018 నవం బరు లో ఐ.పోలవరం మండలానికి చెందిన కొందరు మత్స్యకారులు పాకిస్తాన్ జలాల్లోకి వెళ్లి జైళ్లలో మగ్గిపోయారు. అనేక మంది మత్స్యకారులు ఈ తరహా సమస్యలు తరచూ ఎదుర్కొంటున్నారు.

- ఇక 'హద్దు'ల్లో ఉంచేస్తుంది
- బోట్లకు ట్రాన్స్‌పాండర్లు
- ఒక్కో మిషన్ ఖరీదు రూ.21 వేలు
- దేశ హద్దులు దాటకుండా అలెర్ట్
- కి.మీ దూరంలోనే హెచ్చరికలు
- వేటకు వెళ్లే మత్స్యకారులకు రక్షణ
- అప్రమత్తమై వచ్చేందుకు వీలు
- ఇతర దేశాల జైళ్లలో ఎంతో మంది

తొలుత వాటికే..

కాకినాడ జిల్లాలో 76 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. తీరం వెంబడి 23 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల ద్వారా 4,150 బోట్లు చేపల వేటకు అనుమతి పొందాయి. ఈ బోట్ల ద్వారా 36,112 మంది ఆధారపడి జీవిస్తున్నారు. వీటిలో తొలుత సుదీర్ఘతీరం సముద్రంలో వేటకు వెళ్లే మెకనైజ్డ్ బోట్లకు ఈ యంత్రాలను బిగిస్తున్నారు. తొలి విడత కింద ఉమ్మడి జిల్లాలో 1,600 బోట్లకు ఈ యంత్రాలను అమర్చాలని జిల్లా మత్స్యశాఖ లక్ష్యం విధించుకుంది. ఇందులో ఇప్పటి వరకు 350 బోట్లకు ట్రాన్స్‌పాండర్లు బిగించారు. మిగిలిన బోట్లకు బిగించే ప్రక్రియ కొనసాగుతోంది. మోటారైజ్డ్ బోట్లకు సైతం వీటిని బిగించాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ట్రాన్స్‌పాండర్లు బిగించాలంటే సంబంధిత బోట్లలో బ్యాటరీలు నిరంతరం పనిచేస్తుండాలి. ప్రస్తుతం ఇవి ఉన్న బోట్లకే యంత్రాలు బిగిస్తున్నారు. అటు కోనసీమ జిల్లాలో 64 వరకు మెకనైజ్డ్ బోట్లు ఉన్నాయి.వీటికి కూడా బిగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ప్రస్తుతం భైరవపాలెంలో ఉన్న బోట్లకు కోనసీమ జిల్లా మత్స్యశాఖ అధికారులు యంత్రాలను అమర్చేపనిలో ఉన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మెకనైజ్డ్ బోట్లు ఉన్నా సముద్రంలో వేటకు వెళ్లేవి తక్కువే.

బోట్లకు కుయ్..కుయ్

ట్రాన్స్‌పాండర్

కేంద్రం మత్స్యకారుల భద్రతకు పీఎంఎం ఎస్‌వై పథకం కింద ట్రాన్స్‌పాండర్లను ప్రవేశ పెట్టింది. వీటిని సముద్రంలో వేటకు వెళ్లే బోట్లకు అమర్చుతోంది. ట్రాన్స్‌పాండర్లు ఉన్న బోట్లు పొరపాటున పొరుగుదేశాల సముద్ర జలాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంటే కిలోమీటరు దూరం ఉండగానే హెచ్చరిస్తాయి. తద్వారా పొరుగు దేశాలకు చిక్కుకోకుండా మత్స్యకారులు సురక్షితంగా ఉండేలా ఇవి కీలకపాత్ర పోషించనున్నాయి.ఒక్కో ట్రాన్స్ పాండర్ ధర రూ.21 వేలు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా ఇస్తున్నాయి.ప్రస్తుతం వీటి బిగింపు కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఊపందుకుంది. ట్రాన్స్‌పాండర్లు ఉన్న బోట్లను అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు కేంద్ర ప్రభుత్వం తరచూ పర్యవేక్షించనున్నాయి. తద్వారా అంతర్జాతీయ సరిహద్దుల దగ్గరకు వెళ్లే ముప్పు ఉంటే హెచ్చరించడంతో పాటు సముద్రంలో తుపాన్లు, ఇతర ఆపద ఏది ఎదురైనా కాపాడేందుకు సిద్ధంగా ఉంటాయి.ఒకసారి ట్రాన్స్‌పాండర్‌ను బోటుకు బిగించిన తర్వాత శాటిలైట్‌తో బోటు అనుసంధానం అయిపోతుంది. తద్వారా ఏ సమస్య వచ్చినా మత్స్యకారులకు ఇబ్బంది ఉండదు.ఇన్‌కాయిస్ (ఇండియన్ నేష నల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్) ద్వారా సముద్రంలో చేపలు ఎక్కువ ఎక్కడ ఉన్నాయనే సమాచారం సైతం ఎస్ఎంఎస్‌ల ద్వారా ఇన్‌కాయిస్‌నుంచి మత్స్యకారులకు అందుతుంది.

నో ఛాన్స్!



- ఒక్కరినీ వరించని ఎమ్మెల్సీ పదవి
- ఉమ్మడి జిల్లా నేతల్లో నిరాశ
- ఆశావహులకు బుజ్జగింపులు
- వచ్చేసారి చూద్దామని హామీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కూటమి నేతలకు నిరాశ ఎదురైంది.. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవి ఆశించిన నేతల ఎదురుచూపులు ఫలించలేదు.. పదవి తప్ప కుండా వస్తుందని ఆశించిన నాయకులకు నిరాశే మిగిలింది. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ నుంచి ఎక్కువ మంది ఎమ్మెల్సీలు ఆశించారు. ఉమ్మడి జిల్లాలో ఒక రెండు ఎమ్మెల్సీలు లభిస్తాయని అంతా ఊహించినా లెక్కతప్పింది. అధిష్ఠానం ఒక్కటీ కేటాయించలేదు.

పలువురికి నిరాశే..

సార్వత్రిక ఎన్నికల్లో కూటమిలో సీట్ల సర్దుబాట్ల మధ్య కొందరికి టికెట్లు దక్కలేదు. అప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు నేతలకు ఎమ్మెల్సీ కోటాలో చూద్దామని పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చింది.ఈ నేపథ్యంలో చాలా మంది ఎదురు చూశారు. కానీ రాష్ట్రంలో కేవలం ఐదు ఎమ్మెల్సీ స్థానాలు మాత్రమే ఖాళీ అవ్వడం వల్ల తెలుగుదేశం 3, జనసేన 1, బీజేపీ 1 కేటాయించారు. దీని వల్ల ఆశావహులకు అవకాశం రాలేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ,నిడదవోలు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు పదవి ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చింది. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కెఎస్ జవహర్‌కు హామీ ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. ఇక కోనసీమ నుంచి మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం కూడా పదవి ఆశించారు.రాష్ట్రంలో ఎక్కువగా ఆశించే వారి సంఖ్య బాగా పెరడంతో అధిష్ఠానానికి ఇబ్బందికరంగా మారింది. సర్దుబాట్ల వల్ల పలువురు ఎమ్మెల్సీ ఆశలు నీరుగారిపోయాయి.ఈ మేరకు సీఎం చంద్రబాబు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో మాట్లాడి తర్వాత ఎప్పుడు ఎమ్మెల్సీ ఖాళీ అయినా హామీ ఇచ్చిన వారికి ఇస్తామని చెప్పాలని ఆదేశించారు.ఈ నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఇద్దరు నేతలకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. 2027లో ఎక్కువ ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతాయని..అప్పుడు మీకు కచ్చితంగా స్థానం కల్పిస్తామని స్వయంగా సీఎం చంద్రబాబు చెప్పమన్నారని చెప్పడం గమనార్హం.

యనమలకు కీలక పదవి?

ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పదవి కాలం ఈనెల 29తో ముగియనుంది. ఈసారి ఆయన ఎమ్మెల్సీని ఆశించినా దక్కలేదని సమాచారం. సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు, టీడీపీలో కీలకనేతగా ఉన్న యనమలకు త్వరలోనే మరో కీలక పదవి రానున్నట్టు ప్రచారం జరుగుతోంది. రాజ్యసభ సభ్యత్వం వస్తుందని లేదా గవర్నర్ పదవి లభిస్తుందనే ప్రచారం ఉంది.తుని నియోజకవర్గం పరిధిలోని తేటగుంటలో హైవే సమీపంలో తోటలోని ఆయన ఇంటివద్ద ఇటీవల పెద్ద గేటు నిర్మిస్తుండడంతో పాటు, గేటు సమీపంలో బంకర్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏదో కీలక పదవి రాబోతుందనే ప్రచారం ఊపందుకుంది.

ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీగా 'ఆలమూరు'



సర్పంచ్ లావణ్యను సత్కరిస్తున్న ఎంపీడీవో తదితరులు



ఆలమూరు పంచాయతీ కార్యాలయం

- సర్పంచ్, కార్యదర్శులకు పలువురు అభినందనలు

ఆలమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామపంచాయతీగా ఆలమూరు గ్రామ పంచాయతీ ఎంపికైంది. దేశవ్యాప్తంగా ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ పోటీలకు 770 గ్రామ పంచాయతీలు ఎంపిక కాగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఆలమూరు పంచాయతీ కూడా ఒకటిగాఉంది. దీనిపై కోనసీమ జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2025-26 సంవత్సరంలో పంచాయతీ అన్నిరంగాల్లో ముందజలో ఉండేలా కార్యకలాపాలు నిర్వహిస్తే ఈ పోటీల్లో నిలబడి తుదిగా జాతీయస్థాయి ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డుకు కూడా ఎంపిక కానుంది. పంచాయతీ కార్యదర్శి కె.మోక్షాంజలి, పంచాయతీసిబ్బంది, మండలస్థాయి అధికారుల సహాయ సహకారాలతో ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ అవార్డును గెలుచుకుంటామని సర్పంచ్ నేలపూడి లావణ్యకుమార్‌రాజా ధీమా వ్యక్తంచేశారు. శానిటరీ, డ్రైనేజీ, రహదారుల అభివృద్ధిలో గ్రామాన్ని ప్రగతిపథంలో నడిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి మోక్షాంజలి అన్నారు. ఉమెన్ ఫ్రెండ్లీ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఎంపీడీవో ఎ.రాజు ఆధ్వర్యంలో సర్పంచ్ లావణ్య, కార్యదర్శి మోకాంజలి, బిల్లు కలెక్టర్ రమణలను ఘనంగా సత్కరించారు. జాతీయస్థాయి ఫ్రెండ్లీ ఉమెన్ పంచాయతీగా ఎంపిక కావడంపట్ల పలువురు సర్పంచ్‌లు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

కొత్త హైవే



216ఇ రహదారిగా అభివృద్ధి చెందనున్న నడిపూడి-ముక్కామల కెనాల్ రోడ్డు

- కోనసీమలో పేరూరు జంక్షన్‌నుంచి కొత్తపేట మీదుగా రావులపాలెం వరకు కొత్తగా 216ఇ హైవే
- డీపీఆర్ తయారీలో అధికారులు
- 31 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ
- 25 మీటర్ల వెడల్పుతో జాతీయ రహదారి నిర్మాణం
- భూములు, ఇళ్లు కోల్పోనున్న బాధితులు
- ఆందోళన బాటలో నిర్వాసితులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మరో కొత్త హైవే రోడ్డు పడనుంది. రెండు ప్రధాన జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ కొత్తగా మరో హైవే మార్గం నిర్మాణానికి కేంద్ర ఉపరితల రవాణా శాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. ఇందుకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతోపాటు డీపీఆర్ తయారీకి అధికారులకు ఆదేశాలిచ్చింది.

జిల్లాలో 216ఇ పేరుతో 31 కిలోమీటర్ల మేర కొత్తగా జాతీయ రహదారి ఏర్పాటుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగా ఇప్పటికే ఆ రహదారి మార్గాన్ని గుర్తించి భూసేకరణ చేపట్టే ప్రక్రియలో భాగంగా ఎన్ని భవనాలకు నష్టం వాటిల్లుతుంది. ఎన్ని కొబ్బరి చెట్లు, ఇతర ఫల వృక్షాలు తొలగించాల్సి వస్తుందనే అంశాలపై ప్రత్యేక బృందాలు అంచనాలు వేయడంలో నిమగ్నమయ్యారు. కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ఆదేశాలతో 216 జాతీయ రహదారి నుంచి 216ఇగా అప్‌గ్రేడేషన్‌గా ఏర్పడే రహదారి రావులపాలెం సమీపంలోని వెదిరేశ్వరంవద్ద 216ఏ జంక్షన్‌లో కలిసేలా రూట్ మ్యాప్‌ను ఖరారు చేశారు. రహదారి విస్తరణలో భూములు, ఇళ్లులో కోల్పోయే వారు ఆందోళన బాట పడుతున్నారు. 216 జాతీయ రహదారికి సంబంధించి వై.జంక్షన్ లేదా పేరూరు హైస్కూలు సమీపంలో ఉన్న జంక్షన్‌నుంచి ఏర్పడి వివిధ గ్రామాలగుండా సాగుతూ కొత్తపేట సమీపంలోని పలివెల జంక్షన్‌కు ఈ రహదారి చేరుకుంటుంది. దీనిలోభాగంగా 30 కిలోమీటర్ల పైబడిన రహదారిని 25మీటర్ల మేర విస్తరించే విధంగా అధికారులు డీపీఆర్(డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేయడంలో నిమగ్నమయ్యారు.

విస్తరణ మార్గం ఇలా..

216ఇ రహదారి పేరూరు జంక్షన్‌నుంచి ప్రారంభించి ఇందుపల్లి, ఈదరపల్లి, నడిపూడి, పాలగుమ్మి, గంగలకుర్రు, మొసలపల్లి, ఇరుసుమండ, ముక్కామల, కొత్తలంక, పుల్లేటికుర్రు, నేదునూరు, మోడేకుర్రు, బిళ్లకుర్రు, అవిడి మీదుగా పలివెల జంక్షన్‌కు చేరుకుంటుంది. అక్కడినుంచి కొత్తపేట, దేవరపల్లి, వెదిరేశ్వరం, లక్ష్మీపోలవరం గ్రామాల మీదుగా 216ఏగా రావులపాలెం జాతీయ రహదారిలో కలుస్తుంది. ఈ రెండు ప్రధాన జాతీయ రహదారులను అనుసంధానం చేస్తూ ఈ రహదారిని ఏర్పాటు చేయడంవల్ల కోనసీమ రవాణా రంగంలో మరింత అభివృద్ధి చెందనుంది.

పక్కా భవనాలకు నష్టమే..

ఈ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం తాజాగా చేపడుతున్న భూసేకరణవల్ల నిర్వాసితులయ్యే రైతులతోపాటు మార్గమధ్యలో వందలాది భవనాలకు చెందిన యజమానులు నిర్వాసితులు కానున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు, భవన యజమానులు ఆందోళన బాటపడుతున్నారు. ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ రహదారిగా పేర్కొంటున్న ఈ జాతీయ రహదారి విస్తరణ పూర్తిగా చేల మధ్య నుంచి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, కానీ అందుకు భిన్నంగా రహదారి ఎలైన్‌మెంట్‌ను ఇష్టానుసారంగా మార్చి సారవంతమైన భూముల తోపాటు విలువైన భవనాలు కోల్పోయేలా చేయడంలో కొందరు ప్రముఖ పాత్ర వహించారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్వాసితులకు ఎటువంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుని ప్రత్యామ్నాయ రహదారి మార్గాలను అన్వేషించి డీపీఆర్ తయారీకి చర్యలు తీసుకోవాలని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఈ రహదారి త్వరితగతిన చేపట్టేందుకు మరోవైపు రెవెన్యూశాఖ అధికారులు భూసేకరణవైపు దృష్టిసారిస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా ఈదరపల్లి నుంచి నడిపూడి మీదుగా ముక్కాలమల వెళ్లే కెనాల్ మార్గంతోపాటు అక్కడినుంచి పలివెల వరకు కెనాల్ మార్గం వైపే రోడ్డు విస్తరణ జరగనున్నట్టు భావిస్తున్నారు. మొత్తంమీద 216ఇ కొత్త జాతీయ రహదారి కోనసీమలో రూపుదిద్దుకోవడంతో రవాణా రంగం పురోభివృద్ధి చెందనుంది.

అక్రమంగా రొయ్యల చెరువుల తవ్వకాలు

- అధికారుల అండతో శని, ఆదివారాల్లో తవ్వకాలు
- పోలీసులు అడ్డుకున్నా ఆగని వైనం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు



కాట్రేనికోన మండలం మొండిపొరవద్ద ఎక్స్‌కవేటర్‌తో చెరువుల తవ్వకాలు

కాట్రేనికోన, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం మొండిపొర వద్ద ప్రజల నివాసాల మధ్య కొందరు ఉప్పునీటి రొయ్యల చెరువులు తవ్వుతున్నారు. సర్వే నెం.481/2లో మూడెకరాల పంటచేలను ఈనెల 8న భూయజమానులు దగ్గరుండి రొయ్యల చెరువులు తవ్విస్తున్నారు. ఇలాఅయితే మేము ఎలా ఉండాలంటూ స్థానిక తిమ్మాపురం, మొండిపొర పరిసరాల ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భూయజమానులను ప్రశ్నిస్తే తవ్వకాలు కొన సాగుతాయని, మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండని తెగేసి చెబుతున్నారు. వెంటనే స్థానికులు వీఆర్వో కళ్యాణ్ సింగ్‌కు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానని నమ్మబలికి ఆ తర్వాత ఫోన్ స్విచ్ ఆఫ్ చేయడంతో బాధితులు అవాక్కయ్యారు. రెవెన్యూ యంత్రాంగం సూచనల మేరకే శని, ఆదివారాల్లోనే చెరువుల తవ్వకాలు జరుపుతున్నారని బాధిత కుటుంబాలవారు ఆరోపిస్తు న్నారు. శనివారం యంత్రాలతో చెరువుల తవ్వకాలు ప్రారంభించడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వారు వెళ్లి తవ్వకాలను అడ్డుకున్నారు. అనంతరం ఆదివారం వేకువజామున మళ్లీ తవ్వకాలు మొదలు పెట్టారు. అనుమతి లేకుండా చేపట్టిన రొయ్యల చెరువుల తవ్వకాలను స్థానిక రెవెన్యూ అధికారులు ప్రోత్సహించడం వెనుక అసలు కారణాలు తమకు తెలియడం లేదంటున్నారు. తాము వెళ్తే భూయజమానులు తమపై దౌర్జన్యానికి సిద్ధంగా ఉన్నారని బాధితులు గగ్గోలు పెడుతున్నారు. ఆక్వా సాగు జరిగితే తమ పొలాల్లో ఇక తిండి గింజలు పండే అవకాశం లేదని ఆవేదన చెందుతున్నారు. ఇక చేసేదేమీలేక జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బాధిత రైతులు సంసాని శ్రీనివాసరావు, విత్తనాల రామకష్ణ, ఎస్ఎస్ఎన్ మూర్తి, సంసాని గంగాధరరావు, సంసాని వెంకటేశ్వరరావు, కుడిపూడి సాయిబాబు, విత్తనాల సూర్యనారాయణ, విత్తనాల వీరబాబు, సంసాని సత్యనారాయణ ఉన్నారు.

కూటమి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం

- చారిత్రాత్మక విజయం తర్వాత జనసేన ఆవిర్భావ దినోత్సవ సభ
- జనసైనికులు, వీరమహిళలు విజయవంతం చేయాలి: మంత్రి మనోహర్



అమలాపురంలో జనసేన ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

అమలాపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లమనోహర్ అన్నారు. ఎన్నో అవమానాలను భరించి కేసులను ఎదుర్కొని జనసైనికుల బాసటతో కూటమి ప్రభుత్వాన్ని రాష్ట్రంలో నెలకొల్పేందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన కృషిని ఎన్నటికీ మరువరాదన్నారు. అమలాపురం మెయిన్ రోడ్డులోని ఓ కల్యాణమండంలో ఆదివారం అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ కోఆర్డినేటర్ బండారు శ్రీనివాసరావు అధ్యక్షతన జనసేన ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మనోహర్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రైతులకు సకాలంలో ధాన్యం సొమ్ములు చెల్లించలేదన్నారు. రూ.1674కోట్లు బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు ఎంతో ఇబ్బంది పడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే రైతులకు చెల్లించామని తెలిపారు. జనసేన ఆవిర్భావ సభను పిఠాపురంలోని చిత్రాడలో ఈనెల 14న నిర్వహిస్తున్నట్టు మంత్రి తెలిపారు. రాష్ట్రంలో చారిత్రక విజయం అందుకున్న తర్వాత జరుగుతున్న ఆవిర్భావ దినోత్సవ సభను కోనసీమలోని జనసైనికులు, వీరమహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బొలిశెట్టి శ్రీనివాసరావు, దేవవరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, బొమ్మిడి నాయకర్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ కార్పొరేషన్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు, నాయకులు కల్వకొలను తాతాజీ, ఇసుకపట్ల రఘుబాబు, కొప్పుల నాగమానస తదితరులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జిలు వేగుళ్ల లీలాకృష్ణ, పోలిశెట్టి చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాయకులు నల్లా శ్రీధర్, కల్వకొలను తాతాజీ, చిక్కం భీముడు,లింగోలు పెదకాపు, యేడిద శ్రీను, పిండి రాజా,సూదా చిన్నా, రొక్కాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అందపు అ(మ)ంచు!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల మంచు దుప్పటి పంట పొలాలు, జాతీయ రహదారి వెంబడి మార్గాలను కప్పేస్తోంది. ఆ అందమైన దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా..



ప్రత్తిపాడు హైవేపై..



రౌతులపూడిలో సూర్యోదయాన..



పిఠాపురంలో పొలాలపై..

కోరుకొండ నరసన్న కల్యాణోత్సవాలు ప్రారంభం





అంకురార్పణకు పుట్టమన్ను తవ్వుతున్న అర్చక స్వాములు, అంకురార్పణ చేస్తున్న దృశ్యం



విద్యుత్ కాంతుల్లో నరసింహస్వామి కొండ

కోరుకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నవ నరసింహ క్షేత్రాల్లో ఒకటైన స్వయంభూ కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం రాత్రి ఆలయ ముఖ మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అంతకుముందు మంగళ వాయిద్యాలు, మేళతాళాలతో శ్రీచక్ర పెరుమాళ్లను తీసుకుని దేవుడి కోనేటి వద్దకు వెళ్లి పుట్టకు శాస్త్రోక్తంగా పూజలు చేసి పుట్టమన్ను సేకరించారు. అనంతరం ఆలయం వద్ద అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు పాణింగపల్లి పవన్కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ పర్యవేక్షణలో నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్నవరం దేవస్థానం అధికారులు పర్యవేక్షణలో వివిధ ప్రభుత్వ శాఖాధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. సోమవారం రథోత్సవం సందర్భంగా ఏ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ వైశ్రీకాంత్, సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆలయం వద్ద పోలీస్ అవుట్పోస్టు ఏర్పాటు చేశారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోరుకొండ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంచామని డీఎస్పీ తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవాల నిర్వహణకు అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ వైవీ రోహిత్, కోరుకొండ దేవస్థానం ఛైర్మన్ రంగరాజ భట్టర్, ప్రత్యేక సిబ్బంది తరలివచ్చారు. దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి ఉత్సవాలకు 250మంది సిబ్బందిని నియమించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ నుంచి డిప్యూటేషన్పై మరికొంత మంది సిబ్బంది, అర్చకస్వాములు, వేద పండితులు వచ్చారు.

నేడు రథోత్సవం, కల్యాణం...

స్వామివారి రథోత్సవం సోమవారం మధ్యాహ్నం 1.56గంటలకు నిర్వహించనున్నారు. రథోత్సవానికి ముందు స్వామిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరించి ప్రత్యేక పల్లకిలో మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య తోడ్కొని వచ్చి రథంపై ఆశీనులను చేస్తారు. రథానికి ప్రత్యేక పూజలు చేసి వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణ మధ్య దేవస్థానం నుంచి రథోత్సవం బయలుదేరుతుంది. రాత్రి 9గంటలకు కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగుతుంది. ఈ మేరకు స్వామి కల్యాణ మండపాన్ని విశేష పుష్ప అలంకరణలతో సిద్ధం చేశారు. రథోత్సవం అనంతరం ఎదుర్కోలు సన్నాహంతో నూతన వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు సమర్పించి మేళతాళాలతో స్వామి, అమ్మవార్లను రథం పై నుంచి ప్రత్యేక పల్లకీలో ఆలయానికి తోడ్కొని వస్తారు. రాత్రి 8గంటల సమయంలో మంగళస్నానం నిర్వహిస్తారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం స్వామి కల్యాణం రాత్రి 9 గంటలకు జరుగుతుంది.

సర్వవరంలో వైభవంగా
శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ

చిన్నజీయర్స్వామి చేతులమీదుగా నిర్వహణ



శ్రీసీతారాముల కల్యాణం దృశ్యం



విగ్రహ ప్రతిష్ఠా మహాక్రతువులో పాల్గొన్న చిన్నజీయర్స్వామి

సర్వవరం జంక్షన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సర్వవరంలో 160 ఏళ్ల క్రితం నిర్మించిన హనుమ, లక్ష్మణ సహిత శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ జీర్ణోద్ధరణ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం అశేష భక్తుల శ్రీరామ నామస్మరణ నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త పురాణం వెంకటాచార్యులు, వెంకటాచార్యులు, ధరణిధరచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాకుంభ సంప్రోక్షణ మహాక్రతువులో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్స్వామి పాల్గొన్నారు. స్వామివారికి ప్రాతఃఆరాధన, సేవాకాలం, చతుఃస్థానార్చన, తత్త్వన్యాస హోమం, గర్తన్యాసం, రత్నన్యాసం, యంత్ర స్థాపన, బింబ స్థాపన, శ్రీసుదర్శన పెరుమాళ్ల, నమ్మాళ్వార్, భగవద్ రామానుజాచార్యస్వామి తదితర పూజలు జరిపారు. విశేష పూజలు అనంతరం అశేష భక్తుల నడుమ విగ్రహమూర్తులకు చిన్నజీయర్ స్వామి స్వహస్తములతో పునర్వసు నక్షత్రయుక్త వృషభ లగ్న సముహూర్తంలో మహాకుంభ సంప్రోక్షణ, దృష్టికుంభ, మంగళద్రవ్య దర్శనం కావించారు. ఈ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠా, ధ్వజ స్తంభం స్థాపనకు ముందు భక్తులను ఉద్దేశించి చిన్నజీయర్ స్వామి అనుగ్రహభాషా పారాయణం చేశారు. కార్యక్రమంలో సాతులూరి గోపాల కృష్ణమాచార్యస్వామి, త్రిదండి చిన్న రామచంద్ర జీయర్స్వామి, గోవిందా జియ్యర్, త్రిదండి అహోబిల రామానుజజీయర్స్వామి పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరాగా అన్నప్రసాద వితరణ చేశారు.

పెద్దిపాలెంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందాలు



పందెంలో పరుగు పెడుతున్న ఎద్దులు

ప్రత్తిపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామంలో ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పందాల పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ధర్మవరానికి చెందిన జువ్వల సత్తిబాబు ఎడ్ల జతకు ప్రథమ బహుమతి లభించింది. కాకినాడకు సమీపంలోని కొవ్వాడకు చెందినమట్టా నవనీత్ శ్రీమణికంఠ ఎడ్ల జతకు ద్వితీయ స్థానం, సామర్లకోట మండలం జి.మేడపాడుకు చెందిన మలిరెడ్డి అన్నపూర్ణ ఎడ్ల జతకు తృతీయస్థానం లభించాయి. అలాగే జూనియర్స్ విభాగంలో కోనసీమకు చెందిన కాపవరం కుంచం మనోజ్ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి, రాజమండ్రి సమీపంలోని హుకుంపేటకు చెందిన కురమళ్ల వీరవెంకటసత్య జయవర్ధన్ ఎడ్ల జతకు ద్వితీయ బహుమతి, కాకినాడకు సమీపంలోని కొవ్వాడకు చెందిన మట్టా నవనీత్ శ్రీమణికంఠ ఎడ్లజతకు తృతీయ బహుమతి లభించాయి. సీనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు షీల్డ్లతో పాటు రూ.12వేలు, రూ.10వేలు, రూ.8 వేలు నగదును పెద్దిపాలెనికి చెందిన రెడ్డి పాపమ్మ, గైపూరి శ్రీను, నలమాట రాజు అందజేశారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6వేలతో పాటు షీల్డ్లను పెద్దిపాలెనికి చెందిన కొల్లి శ్రీనివాస్, రాజమండ్రికి చెందిన ఆకుల రామకృష్ణ, శాంతి ఆశ్రమానికి చెందిన రోమాల నాగరాజు అందజేశారు. పోటీల్లో సీనియర్స్ విభాగంలో అనకాపల్లి, ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా 24ఎడ్ల జతలు పాల్గొన్నాయి. పోటీలకు న్యాయ నిర్ణేతలతుగా యనమల కృష్ణ, చేరుకూరి రామకృష్ణ, సిద్ధ నానాజీ, కంటే ఫణికుమార్ వ్యవహరించారు.

టిప్పర్ ఢీ కొని యువకుడి మృతి



మృతిచెందిన నానిబాబు

నిడదవోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయం సమీపంలో టిప్పర్ వ్యాన్ ఢీకొని ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న యువకుడు సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. మృతుడు నిడదవోలు మండలం పందలపర్రు గ్రామానికి చెందిన సంకు నాని బాబు(19)గా గుర్తించారు. నానిబాబుకు తల్లి సోదరీ మాత్రమే ఉండగా సోదరికి వివాహం జరిగిందని, తాపీ కార్మికుడిగా పనిచేసుకుంటూ తల్లి పోషిస్తున్నాడని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పట్టణ ఎస్ఐ పరమహంస కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సంఘటన జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ పోలీస్స్టేషన్లో లొంగిపోయినట్టు సమాచారం.

డివైడర్ను ఢీకొని జొన్నల్లంక యువకుడి మృతి



సాయివెంకట కృష్ణ (ఫైల్)

పి.గన్నవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లిన జొన్నల్లంక యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకగన్నవరం శివారు జొన్నల్లంక గ్రామానికి చెందిన సందాడి సాయివెంకటకృష్ణ(20), లంకే బాలమణికంఠలక్ష్మిసాయి ఉపాధి నిమిత్తం హైదరబాద్లో వెల్డింగ్ పనులు చేసుకుంటున్నారు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో పని ముగించుకుని తమ రూమ్కు ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా వనస్థలిపురంలో ప్రమాదవశాత్తు డివైడర్ను బలంగా ఢీకొన్నారు. ఇద్దరిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. వెంకట కృష్ణ మృతిచెందగా,బాలమణికంఠ చికిత్స పొందుతున్నాడు.

ఆవిర్భావ సభకు మహిళలను ఆహ్వానించేందుకు
జనసేన వినూత్న కార్యక్రమం

బొట్టు పెట్టి పిలిచేలా ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన మంత్రి నాదెండ్ల



కాకినాడలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే పంతం నానాజీ

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామంలో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ సభకు మహిళలను ఆహ్వానించేందుకు వినూత్న కార్యక్రమానికి పార్టీ శ్రీకారం చుట్టిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి ఆడపడుచులను ఆహ్వానించేలా ప్రత్యేకంగా రూపొందించిన బొట్టు స్టిక్కర్లతో కూడిన ఆహ్వాన పత్రికను ఆదివారం కాకినాడ కంట్రోల్ రూమ్లో ఆవిష్కరించారు. పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ తరుపున ఆడపడుచులకు ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి సభకు ఆహ్వానించేలా పార్టీ వీరమహిళ విభాగానికి చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరి ప్రసాద్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి పడాల అరుణ, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ ఉన్నారు.

గిరిజన విద్యార్థిని మృతదేహానికి
పోస్టుమార్టం జరగకుండా అడ్డగింత



ఏరియా ఆసుపత్రి ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

రంపచోడవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మండలం వాడపల్లి ఆశ్రమ పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న గిరిజన విద్యార్థిని మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం జరగనీయకుండా సీఐటీయూ నాయకులు అడ్డుకున్నారు. పాఠశాల నిర్వహకులు సరైన పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడమే సదరు విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు మట్ల వాణిశ్రీ ఆరోపించారు. నాయకులు, వాడపల్లి గ్రామస్థులు, మృతురాలి బంధువులతో కలిసి రంపచోడవరం ఏరియా ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఇందుకు హామీ లభించే వరకూ పోస్టుమార్టం జరగనిచ్చేది లేదన్నారు. పోలీసులు, ఐటీడీఏ అధికారులు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. కాగా ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని, పరిహారాన్ని కూడా తమవంతుగా అందజేస్తామని చర్చలు జరపడంతో ఆందోళన ముగిసింది. అనంతరం పోలీసుల పర్యవేక్షణలో పోస్టుమార్టం నిర్వహించి విద్యార్థిని మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

స్వగ్రామంలో ఎమ్మెల్సీకి ఘన స్వాగతం



ఎమ్మెల్సీకి స్వాగతం పలుకుతున్న అభిమానులు

ఐ.పోలవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం యానాం-ఎదుర్లంక బ్రిడ్జి వద్ద ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన పేరాబత్తుల రాజశేఖర్కు ఆదివారం అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ హోదాలో తొలిసారి స్వగ్రామం జి.వేమవరం వచ్చిన ఆయనకు కూటమి నాయకులు, అభిమానులు మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. తొలుత ఆయన బ్రిడ్జి వద్ద అంబేడ్కర్, జీఎంసీ బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతయింజరం సెంటర్లో ఎదుర్లంక గ్రామస్తులు రాజశేఖర్ను గజమాలతో సత్కరించారు. అనంతరం ప్రచార రథంపై బైక్ ర్యాలీ నడుమ ఊరేగింపుతో స్వగ్రామం జి.వేమవరం చేరుకున్నారు. పాతయింజరం సెంటర్ నుంచి ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, జి.మూలపొలం వరకు ఈర్యాలీ జరిగింది.



మోరిని మెచ్చిన ముర్ము!

మోరి చీరను కొన్న రాష్ట్రపతి

అంతర్వేది, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో ఏర్పాటుచేసిన అమృత్ మహోత్సవ్ సౌత్ ఇండియాలో భాగంగా ఆంధ్రప్రదేశ్ తరఫున కోనసీమ జిల్లా మోరి చేనేత సంఘం ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేనేత చీరను కొనుగోలు చేశారు. రూ.1200 విలువగల ఈ చేనేత చీరను ఆమె కొనుగోలు చేసినట్టు మోరి చేనేత సొసైటీ మేనేజర్ అంకం రామలింగేశ్వరప్రసాద్ తెలిపారు. మోరి చీరల పనితనాన్ని ఆమె ప్రశంసించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తంచేశారు.

హృదయాలను కదిలించిన అన్నదాత



అన్నదాత నాటకంలో ఓ సన్నివేశం

గొల్లప్రోలు రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు ఎదుర్కొంటున్న కన్నీటి కష్టాలను, వారిని ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రదర్శించిన అన్నదాత నాటకం అందరి హృదయాలను కదిలించింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణ కళావేదికపై అపర్ణా నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగురాష్ట్రాల నాటకాల పోటీల్లో భాగంగా రెండోరోజు హైదరాబాద్కు చెందిన కళాంజలి కళాకారులు ప్రదర్శించిన అన్నదాత నాటకం ప్రేక్షకుల కంట తడి పెట్టించింది. వల్లూరి శివప్రసాద్ నాటికను రచించగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు.

ఉమ్మడి కబడ్డీ జట్ల ఎంపిక

సామర్లకోట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల తరఫున పోటీ చేసేందుకు జూనియర్, సబ్ జూనియర్ కేటగిరిలలో బాలురు, బాలికల జట్ల క్రీడాకారులు ఎంపిక పోటీలు ఆదివారం కాకినాడ సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనువాసు, ప్రో కబడ్డీ రిఫరీ బోగిళ్ళ మురళీకుమార్, డీవీశ్రీనివాసు, కోశాధికారి నిమ్మకాయల కిరణ్కుమార్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించి ప్రతిభ చాటినవారిని ఎంపిక చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

పెరవలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా ఖండవల్లి జాతీయ రహదారిపై పది టన్నుల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పువిప్పర్రు నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెనికి హైషర్ వ్యాన్లో బియ్యాన్ని తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో సివిల్ సప్లయ్, తహశీల్దార్ ఎస్ఎస్ సుధీర్రెడ్డి తెల్లవారుజామున ఖండవల్లి వద్ద జాతీయ రహదారిపై పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. డ్రైవర్ వైచర్ల శివ కిరణ్ను అదుపులోకి తీసుకుని వ్యాన్ను పెరవలి పోలీసులకు అప్పగించారు.

5 దశాబ్దాల బంధం.. అద్వితీయం!



గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కలిసిన పదో తరగతి పూర్వ విద్యార్థులు

గొల్లప్రోలు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కలిసి చదువుకున్న వారంతా 5 దశాబ్దాల తర్వాత తిరిగి కలుసుకున్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1973-74బ్యాచ్కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలతో తడిచి ముద్దయ్యారు. పూర్వ విద్యార్థులు దంగేటి అప్పన్న, ఒంటెద్దు రామలింగం, కొసిరెడ్డి రామకృష్ణ, పేర్రాజు, నారాయణ, చక్కపల్లి ధర్మరాజు 3ఏళ్లుగా కృషిచేసి అందరూ ఒకేచోట చేరేలాచేయడంలో సఫలీకృతులయ్యారు.

కాకినాడలో...

కాకినాడ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జగన్నాధపురంలోని ఎంఎస్ఎన్ ఛారిటీస్ డిగ్రీకళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఐడియల్ కళాశాల ఆవరణలోని సెమినార్హాల్లో ఆదివారం జరిగింది. కళాశాలలో బీకాం చదివిన మొదటి, రెండవ బ్యాచ్(1971-74, 1972-75) విద్యార్థులు సమావేశమై 50 వసంతాల సంబరాలను నిర్వహించుకున్నారు. ఉత్సాహంతో, కేరింతలతో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆనాటి తమ గురువులైన ఎస్ఎం కొంపెల్ల, వీఎల్ గాంధీలను సత్కరించారు.



కాకినాడ ఎంఎస్ఎన్ ఛారిటీస్ డిగ్రీ కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

GOLD FINANCE

బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999

AJB-209318

4 Lines CLASSIFIED Rs.230/- Only

నిత్యాన్నదానానికి విరాళం

అంతర్వేది, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఏలూరుకు చెందిన మద్దిపట్ల ఆనంద్ కుమార్‌శర్మ, కుటుంబ సభ్యులు రూ.50వేలు విరాళంగా అందజేశారు. విరాళ దాతలకు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కాట్రేనికోన, మార్చి 9(ఆన్‌లైన్): గెద్దనపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీహనుమత్ సీతాలక్ష్మణసమేత విగ్రహ ప్రతిష్ఠ, శిఖరప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. వాడపల్లిరుకు చెందిన ఆగమశాస్త్ర పండితుడు సుదర్శనం వెంకటజనార్ధనాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

మహిళా చైతన్యంతోనే సాధికారత

అసోసియేట్ ప్రొఫెసర్ వల్లీ



మాట్లాడుతున్న మానవహక్కుల నాయకురాలు వల్లీ

మలికిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, పురుష సమానత్వం గురించి హక్కులు, ప్రాదేశిక సూత్రాలు రాజ్యాంగంలో ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైందని, స్త్రీలు చైతన్యవంతులై హక్కుల అమలు కోసం ఉద్యమించాలని మానవహక్కుల కార్యకర్త, అసోసియేట్ ప్రొఫెసర్ కె.వల్లీ అన్నారు. ఆదివారం మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్‌లో అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా బహుజన సమాజ్‌పార్టీ మానవహక్కుల వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా సదస్సులో వల్లీ మాట్లాడారు. రాజకీయంగా, సామాజికంగా మహిళలు ఎప్పుడు అభివృద్ధి చెందుతారో అప్పుడే నిజమైన సాధికారత ఏర్పడుతుందన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ప్రధానమైనదని, మహిళలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని ఎంపీపీ ఎంవీ సత్యవాణి అన్నారు. ఈసందర్భంగా మహిళా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. మలికిపురం జడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి, మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, ఎస్.ఎలిజిబెత్, బోనం రాజు, ముత్యాల శ్రీనివాసరావు, బత్తుల లక్ష్మణరావు, రేచల్ జ్యోతి, దుర్గ, పావని పాల్గొన్నారు.

పాలకుల నిర్లక్ష్యం.. ప్రమాదాల బారిన చిన్నారులు

- కళ తప్పిన ఉద్యానవనపార్కు
- తుప్పుపట్టిన ఆట వస్తువులు



అమలాపురం చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంలో తుప్పుపటిన ఆట వస్తువులు

అమలాపురం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిసర గ్రామాల ప్రజల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్య రక్షణలో భాగంగా స్థానిక మంచినీటి చెరువుగట్టున గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ఆరోగ్య ఉద్యాన వనాన్ని ఏర్పాటుచేశారు. తొలినాళ్లలో నిత్యం వందలాది మందితో కళకళ్లాడిన ఉద్యానవనపార్కు నేడు కళ తప్పింది. గత వైసీపీ ప్రభుత్వ పాలకులతో పాటు నేడు పురపాలక సంఘ పాలకపక్షంగా ఉన్న వైసీపీ పాలకులు కూడా పట్టించుకోకపోవడం వల్ల పార్కులో చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన ఆట వస్తువులన్నీ పూర్తిగా తుప్పు పట్టేశాయి. ఇప్పటికే పలువురు వాటి జోలికి వెళ్లి రక్తపు గాయాలతో బయట పడ్డ సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అయినా పాలకులకు మాత్రం కనువిప్పు కలగడం లేదు. ఆదివారం కావడంతో పట్టణ పరిసర ప్రాంతాలకు చెందినవారు పిల్లా పాపలతో చంద్రబాబు ఆరోగ్య ఉద్యాన వనానికి వచ్చినప్పటికీ పిల్లలను కంటికి రెప్పలాచూసుకోవాల్సిన పరిస్థితి తల్లిదండ్రులకు ఏర్పడింది. తల్లిదండ్రుల కళ్లు కప్పి పలువురు పిల్లలు పూర్తిగా తుప్పు పట్టిన జారుడబల్ల, ఇతర ఆట వస్తువులపైకి ఎక్కడంతో అటుగా వచ్చిన వాకర్స్ గుర్తించి వారిని అతి కష్టం మీద కిందకు దించారు. సీఎం చంద్రబాబు పేరిట ఉన్న పార్కుకు ఎప్పుడు గ్రహణం వీడుతుందో గానీ అప్పటి వరకు ఆరోగ్య ఉద్యానవనం జోలికి వెళ్లకపోవడమే మంచిదన్న భావన పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతుంది.

డిమాండ్ల సాధనకు ఓఎన్జీసీపై నిరసన పోరు



ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద ఏడవ రోజు నిరసన దీక్షలు

అల్లవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా ఓడలరేవు గ్రామాభివృద్ధి పట్ల ఓఎన్జీసీ అధికారులు అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సోమవారం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ నుంచి అమలాపురం కలెక్టర్ కార్యాలయం వరకు భారీగా మోటారు సైకిళ్లతో నిరసన ర్యాలీ చేపడతామని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. ఓడలరేవు గ్రామ దత్తత తీసుకోవాలని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద ఏడో రోజు ఆదివారం గ్రామస్తులు రిలే దీక్షలు చేపట్టారు. శిబిరాన్ని దెందుకూరి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఓఎన్జీసీ అధికారులు స్పందించకుంటే ఓఎన్జీసీ కార్యకలాపాలను అడ్డుకుంటామని ఆందోళనకారులు హెచ్చరించారు. రిలే దీక్షల్లో కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్ బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, మందపాటి రామకృష్ణ, పెమ్మాడి వెర్రియ్య, కాండ్రేగుల నాగేంద్రబాబు, రోటే వెంకటేశ్వరరావు, పినపోతు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

కల్పిస్తా: ఎమ్మెల్సీ రాజశేఖర్

ఐ.పోలవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. పాతయింజరం వద్ద ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్, స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సహకారంతో ఐలెండ్ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. స్వర్గీయ జీఎంసీ బాలయోగి ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందిస్తానన్నారు. తనకు ఓటేసిన పట్టభద్రులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

అమలాపురం రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కత్తితో యువకుడు దాడిచేసిన ఘటనలో తీవ్రంగా గాయపడిన అనాతవరం గ్రామానికి చెందిన చాట్ల మాలతి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. దాడిచేసిన జయరామకృష్ణ పోలీసులకు లొంగిపోయాడు. నిరుపేద కుటుంబానికి చెందిన మాలతి వైద్య ఖర్చులు చెల్లించలేని స్థితిలో ఉందని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాలతిని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం పరామర్శించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. దాడికి పాల్పడ్డ జయరామకృష్ణపై కఠినచర్యలు తీసుకోవాలని డీఎస్పీకి సూచించారు.

అమ్మవార్లకు కాగడాల నివేదన



అమ్మవార్లకు కాగడాలు సమర్పిస్తున్న భక్తులు

అంతర్వేది, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మోరి గ్రామంలో వెలసిఉన్న శ్రీమహాలక్ష్మమ్మ, కనక మహాలక్ష్మమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10.30గంటలకు కనకమహాలక్ష్మమ్మ(దుర్గ) కల్యాణం, చలిమిడి, పానకాల నివేదన, సాయంత్రం 6గంటలకు విద్యార్థులతో కాగడాల నివేదన, రాత్రి 9 గంటలకు మోరిపోడుకు చెందిన ఆకులవారి జాతర అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారి ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి. శక్తివేషాలు, బోనాల నృత్యాలు, బుట్టబొమ్మలు, తీన్‌మార్, డోలు సన్నాయిలతో బాణసంచా కాల్పుల నడుమ జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

జనసేన ఆవిర్భావ సభను విజయవంతం చేయండి



రాజోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో ఈనెల14న జరిగే జనసేనపార్టీ 12వ ఆవిర్భావ సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. రాజోలు అంబేడ్కర్ భవనంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీను అధ్యక్షతన ఆదివారం జరిగిన జనసేన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల నుంచి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. మరో ముఖ్య అతిథి రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గం నుంచి నాయకులు తరలి రావాలన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు వైస్ ఎంపీపీ ఇంటిపల్లి ఆనందరాజు, గుండాబత్తుల తాతాజీ, అడబాల రాంబాబు, కాట్న రాజు, గిడుగు శేఖర్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

ముమ్మిడివరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గాడిలంకలో గ్రామస్తులు, భక్తుల విరాళాలు రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీసంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ పత్రిష్ఠా మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయి. బాదంపూడి ప్రసాదశర్మ బ్రహ్మత్వంలో విగ్రహ ప్రతిష్ఠలు మూడు రోజులు నిర్వహించనున్నారు.

ఘనంగా

వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలోని పోశమ్మ ఆలయం వద్ద వీరభద్రస్వామి సంబరాన్ని ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని మేళతాళాలు, బాజాభజంత్రీలు, బాణసంచా కాల్పుల నడుమ వైనతేయ నది వరకు ఊరేగింపు నిర్వహించారు. వైనతేయ నదిలో స్నానమాచరించి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. అనంతరం రాత్రి 60అడుగుల నిప్పుల గుండాన్ని వీరభద్రస్వామి భక్తులు తొక్కారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీఆర్వోలను రెవెన్యూశాఖ పరిధిలోనే కొనసాగించాలి

జేఏసీ చైర్మన్ వాసా దివాకర్



జిల్లా వీఆర్వోల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర జేఏసీ చైర్మన్ దివాకర్

అమలాపురం రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తున్న నూతన సచివాలయాల క్లస్టర్ వ్యవస్థలో గ్రామ రెవెన్యూ అధికారులను రెవెన్యూశాఖ పరిధిలోనే కొనసాగించాలని ఏపీ రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్ పేర్కొన్నారు. దశాబ్దాల కాలంగా వీఆర్వోలు రెవెన్యూశాఖ పరిధిలోనే కొనసాగుతున్నారన్నారు. అందరికీ న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అమలాపురంలో ఆదివారం జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ సమావేశం జిల్లాశాఖ అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా దివాకర్ మాట్లాడుతూ వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చూపాలన్నారు. వీఆర్వోల కేడర్ స్ట్రెంగ్త్ తగ్గించకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సంఘాన్ని కోరుతూ సమావేశం తీర్మానించింది. సమావేశంలో జిల్లా సహ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటగణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి మల్లేష్, రామచంద్రపురం డివిజన్ సంఘ అధ్యక్షుడు స్వామినాయుడు, ఈవీవీ సత్యనారాయణతో పాటు పలువురు నాయకులు, మండలసంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ యాజమాన్యం వేధింపులు మానుకోవాలి



అమలాపురం ఆర్టీసీ డిపో గేట్ మీటింగ్ నిర్వహిస్తున్న యూనియన్ నాయకులు

అమలాపురం రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ యాజమాన్యం డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని యునైటెడ్ వర్కర్స్ యూనియన్, ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం ఆర్టీసీ డిపో వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. డిపో ఉప కార్యదర్శి కె.రంగప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదానికి గురైన డ్రైవర్ కె.గణేష్‌ను డ్రైవర్ కం కండక్టర్ సర్వీస్ డ్యూటీ చేయాలని వేధింపులకు గురిచేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రమాదానికి గురైన డ్రైవర్లను దూర ప్రాంత సర్వీసులకు మూడేళ్ల వరకు పంపించరాదన్న నిబంధన ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. డ్రైవర్ బీఎస్ నారాయణపై విధించిన అక్రమ సస్పెన్షన్‌ను రద్దుచేయాలని, 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గేట్‌మీటింగ్‌లో ఎన్ఎంయూ డిపో కార్యదర్శి పితాని మణిరాజు, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతి, డిపో అధ్యక్షుడు రేవు నారాయణరావు, ఎన్ఎంయూ నాయకుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు



అంతర్వేది, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం చినకొల్లేరులో వెలసి ఉన్న శ్రీపెద్దింటమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా ఏసీ వి.సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం తాగునీరు, వసతిగదులు, టిక్కెట్ కౌంటర్లను పరిశీలించారు. క్యూలైన్‌లో ఉన్న భక్తులకు సిబ్బంది సేవలు అందించారు. మొక్కుల అనంతరం ఆలయ పరిసరాల్లో భక్తులు విందు భోజనాలు చేశారు.

శాశ్వత సుదర్శన హోమానికి

రూ.లక్ష విరాళం

అంతర్వేది, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):నవ నారసింహ క్షేత్రాల్లో ప్రముఖమైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిదిలో నిత్యం నిర్వహించే స్వామివారి నారసింహ సుదర్శన హోమానికి ఆదివారం శాశ్వత విరాళంగా హైదరాబాద్ షేక్‌పేటకు చెందిన అవసరాల సూర్యబయ్యన్నపంతులు, కుటుంబ సభ్యులు రూ.లక్ష అందించారు. విరాళ దాతలకు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.విజయసారథి, భక్తులు పాల్గొన్నారు.

కమణీయం ...

కేశవస్వామి కల్యాణం



పార్వతీ లక్ష్మణేశ్వరస్వామి
శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామివారు

అల్లవరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధి పొందిన అల్లవరం మండలం లక్ష్మణేశ్వరంలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆదివారం రాత్రి పార్వతీ లక్ష్మణేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామిల కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. దొంతుకుర్తి రమేష్ ఆధ్వర్యంలో లక్ష్మణేశ్వరస్వామి కల్యాణం, పెద్దింటి మదనగోపాలాచార్యుల ఆధ్వర్యంలో కేశవస్వామివార్ల కల్యాణోత్సవాలకు గోడిలంక, మొగళ్లమూరు పరిసర గ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు. బిక్కవోలు మండలం మెల్లూరుకు చెందిన దూళ్ల చినసత్తిరాజు-సీతారామ దంపతుల ఆధ్వర్యంలో ఆ గ్రామస్తులు ఏకాహ భజన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాలను భక్తులు ఆసక్తితో తిలకించారు.

నేడు జిల్లాస్థాయి విజ్ఞాన శాస్త్ర సంబరాల ముగింపు వేడుకలు

- క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ముమ్మిడివరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి విజ్ఞాన శాస్త్ర సంబరాల ముగింపు వేడుకలు ముమ్మిడివరం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహిస్తున్నట్టు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ఆధ్వర్యంలో విజ్ఞానశాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నెల 28నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ముగింపు వేడుకలు నిర్వహించి వివిధ విజ్ఞానశాస్త్ర జిల్లాస్థాయి పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందిస్తామన్నారు. అనంతరం జిల్లాస్థాయి క్విజ్ పోటీలు కూడా జరుగుతాయన్నారు. అలాగే ప్రాథమిక స్థాయి విద్యార్థులకు, మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రత్యేక డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల ద్వారా చిన్నారుల సృజనాత్మకతను పెంపొందించేందుకు దోహదపడుతుందన్నారు. సోమవారం జరిగే కార్యక్రమానికి జిల్లాలోని విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరవుతారన్నారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్

రాజోలు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తాటిపాకలో గుమ్మడి కుమారస్వామి హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టుచేసి రాజోలు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐ రాజేష్‌కుమార్‌లు తెలిపారు. తాటిపాకలో ఆర్‌డబ్ల్యుఎస్ వాటర్ ప్రాజెక్టు చెరువులో అదే గ్రామానికి చెందిన కుమారస్వామి ఈఏడాది జనవరి 28న అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాజోలు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామని తెలిపారు. ముగ్గురు నిందితులు ఎం.అప్పలరాజు, ఆర్.రాజు, ఎం.సత్తిబాబులు వీఆర్వో ద్వారా పోలీసులకు లొంగిపోయారని తెలిపారు. నిందితులకు రాజోలు కోర్టు రిమాండు విధించిందన్నారు. హత్య కేసుగా నమోదు చేశామని, ఈకేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పది విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

రాజోలు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధగా విని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విశాఖపట్నం హెచ్‌బీసీసీ డిప్యూటీ సూపరింటెండెంట్ దీపాటి వెంకటేశ్వరరావు అన్నారు. పొన్నమండ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న పదో తరగతి విద్యార్థులకు పొన్నమండ జైభీమ్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ తాడి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పరీక్షా ప్యాడ్లు, పెన్నులు తదితర పరీక్షా సామగ్రిని ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ.రోహిణి, విద్యాకమిటీ చైర్మన్, పితాని వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోరిపోడు సర్పంచ్‌కు నారీరత్న అవార్డు

అంతర్వేది, మార్చి 9(ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమెన్స్ ఫర్ ఎక్సలెన్సీ తమతమ రంగంలో విశిష్ట సేవలు అందించిన మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగాత్రివేణికి నారీరత్న అవార్డును బహూకరించారు. వివిధ సేవా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమంలో ముందున్న గంగాత్రివేణిని ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో అవార్డుతో సత్కరించారు.

ఘనంగా కోదండరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

అంబాజీపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు పంచాయతీ పరిధి వ్యాఘ్రేశ్వరం గొల్లగుంట వద్ద నిర్మించిన ఆలయంలో కోదండరామచంద్రస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ శిఖ, శిలాధ్వజస్తంభం, గణపతి, ఆంజనేయ శిలా విగ్రహాలు సోమవారం ప్రతిష్ఠ చేయనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. అలాగే మాచవరం శ్రీ పార్వతీ రాజేశ్వరస్వామి కల్యాణం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదు రోజులు కల్యాణోత్సవ పూజలు నిర్వహిస్తామన్నారు. 15న స్వామివారి పుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పి.గన్నవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక ఒత్తిడిలేని విద్యను అభ్యసించి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. నరేంద్రపురం గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రిని అందించి అనంతరం మాట్లాడారు. గురుకుల పాఠశాలలో 71మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని వివరించారు. అనంతరం ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి కూటమినాయకులతో కలిసి విద్యార్థులకు పరీక్షల సామగ్రిని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర వెంగమాంబ, ఎంపీటీసీ కొక్కిరి లక్ష్మి, ప్రిన్సిపాల్ పి.వేణు, నాయకులు కేదాశి చిన్న, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, గనిశెట్టి శ్రీనివాసరావు, యడ్ల ఏసుభాస్కరరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో రోటరీ

మలికిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ రోటరీ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో ప్రపంచంలో 12లక్షల మంది సభ్యులు పాల్గొంటున్నారని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మలికిపురంలోని గుబ్బల బాబ్జి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 260దేశాల్లో 44వేల రోటరీ క్లబ్‌ల ద్వారా పోలియో నిర్మూలనకు మిలియన్ డాలర్లు ఖర్చుచేసి రోటరీ సామాజికసేవలో తన పాత్ర నిరూపించుకుందన్నారు. సేవాభావం కలిగిన ప్రతీవారు తన సంపాదనలో కొంతభాగం సేవకు వినియోగిస్తే దేశం ఎంతో ప్రగతి సాధిస్తుందన్నారు. క్లబ్ అధ్యక్షుడు బత్తుల ఝాన్సీబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రోటరీ డిస్ట్రిక్ట్ సెక్రటరీ డాక్టర్ ఎం.పద్మావతి మాట్లాడుతూ ప్రపంచ దేశాల పరిచర్య అభ్యున్నతి, గ్లోబల్ గ్రాండ్ ద్వారా వచ్చే ప్రాజెక్టుల గురించి వివరించారు. గవర్నర్ దంపతులను ఈసందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఎం.శ్రీనివాసరావు, రోటరీ కార్యదర్శి మట్టా రవికుమార్, కోశాధికారి తోలేటి సతీష్, గుబ్బల బాబ్జి, నల్లి శివకుమార్, డాక్టర్ గొల్ల జేసురత్నం, అల్లూరి మధురాజు, గెడ్డం ఫిలిప్‌రాజు, గెడ్డం తులసీభాస్కర్, దొంగ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

28మందికి ఉద్యోగ నియామక పత్రాలు

అమలాపురం టౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆకొండి సింహాచలం సర్వీసు ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం ఏఎస్ఎన్ మహిళా కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. పలు కంపెనీలకు 28మందిని ఎంపికచేసి ఉద్యోగ నియామక పత్రాలను ట్రస్టు చైర్మన్ ఆకొండి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు రవీంద్ర, ఆకొండి చాణక్య, జేసీఐ ప్రతినిధులు వాణి, వాగ్దేవ శ్రీరామ్ పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి పెళ్లి కొడుకాయె..

నేటి నుంచి కల్యాణోత్సవాలు



సత్యనారాయణస్వామి

మామిడికుదురు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మాకనపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న సత్యనారాయణస్వామి కల్యాణోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గ్రామానికి చెందిన సలాది వెంకటేశ్వరరావు దంపతులు స్వామివారి నుదుట కల్యాణ తిలకం దిద్ది పెండ్లి కుమారున్ని చేశారు. ఆలయాన్ని వివిధ రకాల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈనెల 14వరకు స్వామివారి కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈఉత్సవాల్లో స్వామివారు వివిధ రకాల వాహనాలపై ఊరేగింపు నిర్వహిస్తారు. ఐదు రోజులు ఆలయంలో వ్రతాలు, మొక్కులు, అభిషేకాలు జరుగుతాయి. కల్యాణోత్సవాలు ఐదురోజులు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

పెయింటర్స్ యూనియన్ ఎన్నిక

ముమ్మిడివరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కొత్తలంకలోని శ్రీవలీబాబా దర్గా ఆవరణలో ఆదివారం శ్రీవీరేశ్వర పెయింటర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా కాండ్రేగుల రమణ, ఉపాధ్యక్షుడిగా దుగ్గుదుర్తి వెంకటేష్, కార్యదర్శిగా రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా దుర్గారావు, కార్యవర్గ సభ్యులుగా దివి సూర్యనారాయణ, ఆర్.లోవరాజు, డి.నాగరాజు, కముజు రామారావు, విత్తనాల శ్రీనివాసరావు, సంసాని పుల్లయ్య, ఇ.రవికుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన యూనియన్ నాయకులకు పలువురు పూలమాలలతో శుభాకాంక్షలు తెలిపారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

మామిడికుదురు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీసత్యసాయిబాబా శత జయంత్యు త్సవాల్లో భాగంగా నిర్వహించిన సత్యసాయి మెగా మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఈశిబిరాన్ని కడలి గోపాలకృష్ణ-బాబ్జి దంపతులు జ్యోతి ప్రజ్వలనచేసి ప్రశాంతి పతకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. 960మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, రూ.70వేలు విలువైన మందులు అందించారు. 350మంది రోగులకు ఈసీజీ, ఎక్స్‌రే, రక్తపరీక్షలు నిర్వహించారు. 92మందికి కంటి సమస్యలు గుర్తించి కళ్లజోళ్లు అందించారు. పది మందిని ఆపరేషన్ కోసం వేమగిరిలోని పరమహంస నేత్రాలయ ఆసుపత్రికి పంపించారు. కార్యక్రమంలో సత్యసాయి సంస్థల అమలాపురంజోన్ కన్వీనర్ జి.ప్రభాకర్, కాశిన ప్రభాకర్, పర్వత వర్ధనరావు, సేవాసమితి సభ్యులు నెక్కంటి లక్ష్మి, నయినాల సీతామహాలక్ష్మి, లక్కింశెట్టి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ

మామిడికుదురు, మార్చి9(ఆంధ్రజ్యోతి): క్యాట్ ఒలింపియాడ్ పరీక్షల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని మొగలికుదురు శ్రీచైతన్యస్కూలు ప్రిన్సిపాల్ సూదా లక్ష్మి తెలిపారు. ఎనిమిది మంది ప్రథమశ్రేణి సాధించి ప్రోత్సాహకాలు, 40మంది ద్వితీయశ్రేణి సాధించి బంగారు పతకాలు, 65 మంది తృతీయస్థానం సాధించి మెరిట్ సర్టిఫికెట్లు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు.విద్యార్థులను డీన్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అమలాపురం టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బారిన పడి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 78మందికి రూ.62,17,484 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం అమలాపురం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆనందరావు చేశారు. కార్యక్రమంలో పోలమూరి ధర్మపాల్, బడుగు సత్యనారాయణ, మంద గెద్దయ్య, పోతుల నాగరాజు, కడలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో ..

ముమ్మిడివరం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ 4వ వార్డుకు చెందిన పసుపులేటి భార్గవవీరవెంకటచైతన్యకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వైద్య ఖర్చులకు విడుదలైన రూ.21,960 చెక్కును ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్, గుత్తుల సాయి, దొమ్మేటి రమణకుమార్, వాసంశెట్టి అమ్మాజీ, గొల్లపల్లి గోపీ తదితరులు పాల్గొన్నారు.

29 మందికి చెక్కుల అందజేత

ఐ.పోలవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కులను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదివారం లబ్ధిదారులకు అందించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన 29మందికి రూ.29.18లక్షల విలువైన చెక్కులను మురమళ్ల క్యాంపు కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, చెల్లి అశోక్, టేకుమూడి లక్ష్మణరావు, దొమ్మేటి రమణకుమార్, ధూళిపూడి వెంకటరమణ, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, గంజా సుధాకర్, ఏలూరి మూర్తి, సాగిరాజు వాసురాజు, జక్కల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రంగాపురంలో రెండు ఇళ్లు దగ్ధం

అమలాపురం రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం సమనస గ్రామ పరిధిలోని రంగాపురంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. రూ.లక్ష ఆస్తి నష్టం ఏర్పడినట్లు అమలాపురం అగ్నిమాపక అధికారి కేవీఎం కొండలరావు తెలిపారు. సత్తాల చింతాలు, సత్తాల దుర్గారావులకు చెందిన ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలు అదుపుచేశారు. బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మాజీ సర్పంచ్‌లు నడింపల్లి ఉదయబాబు, రాజులపూడి వెంకటేశ్వరరావు(భీముడు) తదితరులు పరామర్శించి సహాయం అందించారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

శివారు ప్రాంతాలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలి

మామిడికుదురు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాలకు సాగునీటి ఎద్ద రాకుండా కృషి చేస్తామని తాటిపాక నీటిసంఘం అధ్యక్షుడు కడలి కృష్ణమోహన్ తెలిపారు. కొమరాడలో తాటిపాక నీటిసంఘ సమావేశం ఆదివారం జరిగింది. ఈసమావేశంలో కృష్ణమోహన్ మాట్లాడుతూ దాళ్వా పంట చివరి దశకు చేరుకోవడంతో నీటి ఎద్దడి రాకుండా ప్రతీ సభ్యుడు వారి పరిధిలోని రైతులతో మమేకమై సాగునీరందేలా చూడాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో చర్చించి పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో అప్పారి వెంకటేశ్వరరావు, చేగొండి పద్మావతి, నేదూరి శ్రీనివాసరావు, జక్కంపూడి సూర్యప్రకాశరావు, అనుచూరి శ్రీనివాసరావు, కులఖండం సీత పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.37లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు జరుపుతున్న దృశ్యం

ఆత్రేయపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక రోజు ఆదాయం రూ.4,37,969 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. చిన్నారులకు చిల్లర నాణెలతో తులాభారాలు నిర్వహించగా భక్తులు పాల్గొన్నారు.

అదనపు జడ్జి పూజలు: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జిల్లా అదనపు జడ్జి వి.నరేష్ కుటుంబ సభ్యులు ఆదివారం స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా స్వామివారికి వారు అష్టోత్తర పూజలు చేశారు. అనంతరం వేద ఆశీర్వచనం పొందారు. ఆలయ సిబ్బంది వారికి స్వామివారి చిత్రపటంతో పాటు, తీర్థ ప్రసాదాలను అందించారు. ఆలయ ఉపకమిషనరు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు.

నూకాంబిక అమ్మవారికి 250 గ్రాముల వెండి బహూకరణ

ఆలమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారికి ఆలమూరుకు చెందిన చిలుకూరి శ్రీలక్ష్మిసౌమ్య వీరప్రసాద్ దంపతులు ఆదివారం 250 గ్రాముల వెండిని బహూకరించారు. అమ్మవారికి దాతల సహకారంతో ఆభరణాల తయారీకి గ్రామానికి చెందిన పలువురు మహిళలు వెండిని సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా వీరప్రసాద్, సౌమ్య దంపతులు స్పందించి ఈ వెండికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అందించారు. కార్యక్రమంలో చిలుకూరి సత్తిబాబు, వెంకటలక్ష్మి, భార్గవ్, శ్రీధర్, నూకాంబిక అమ్మవారి మహిళా భక్త బృందం పాల్గొన్నారు.



చింతలూరు నూకాంబిక అమ్మవారికి వెండిని అందిస్తున్న దాతలు

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి చక్రస్నానం



స్వామివారి చక్రస్నానంలో పాల్గొన్న టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి, ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి బ్రహ్మోత్సవ పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులతో గ్రామోత్సవం జరిపారు. నది ఒడ్డున ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చక్రస్నానం నిర్వహించారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం ఖండవల్లి సూర్యనారాయణచార్యులు ఆధ్వర్యంలో పూర్ణాహుతి జరిపారు. ఈ బ్రహ్మోత్సవాల్లో టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ పాతపాటి వెంకటసత్యనారాయణరాజు దంపతులతో బ్రహ్మోత్సవాలను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆలయ మేనేజర్ వినయ్‌కుమార్‌రాజు వీటి ఏర్పాట్లను చేపట్టారు.

ఘనంగా గోగులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ద్రాక్షారామ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఓదూరులో ఉన్న గోగులమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. ఓదూరు గ్రామంలో గోగులమ్మ ఆలయాన్ని పునర్నిర్మించారు. ఇందులో భాగంగా అమ్మవారి విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. ఈనెల 7 నుంచి పూజాధికాలు ప్రారంభించగా, ఆదివారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహ వచనం, రత్నన్యాసం అనంతరం 10.54 గంటలకు విగ్రహాలను ప్రతిష్ఠించారు. మాజీ సర్పంచ్ కొండేపూడి శ్రీనివాస జానకిరామయ్య, వెంకట రత్నకుమారి దంపతులు యజ్ఞకర్తలుగా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, చిక్కాల దొరబాబు, రేవు శ్రీను, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాలు

రావులపాలెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం స్వామివారికి ఖండవల్లి రాజేశ్వరవరప్రసాద్‌చార్యులు ఆధ్వ ర్యంలో వాడపల్లి కమలనాథ్ అర్చకత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం కల్పవృక్ష వాహనోత్సవం, రాత్రి సర్వభూపాల వాహననోత్సవ సేవలు జరిగాయి. భక్తులు, గోవిందమాలధారులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కల్పవృక్ష వాహనోత్సవంలో పాల్గొన్న భక్తులు

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న అర్చకులు

కపిలేశ్వరపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 16 వరకు జరిగే వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు ఎస్ఎల్ఎన్‌బీ శ్రీనివాసాచార్యులు, అర్చక సోదరుల సహాయంతో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెలను చేసి నూతన వస్త్రాలు, పూలమాలలతో అలంకరించారు. సాయంత్రం విశ్వ క్సేన పూజ, పుణ్యాహ వచనం, దీక్షాధారణ అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణం తదితర పూజలను జరిపారు. సోమవారం స్వామివారి రథోత్సవం, పోలేరమ్మ ఆలయం వద్ద తీర్థమహోత్సవం, రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో రాంబాబుచౌదరి తెలిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు సాధ్యం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న దృశ్యం

రాయవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారానే ఉన్నత శిఖరాలు సాధ్యమవుతుందని రాయవరం భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాస గుప్తా అన్నారు. ఆదివారం భాష్యం స్కూల్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. సభలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉత్తమ పౌరులుగా తయారవ్వాలన్నారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన, నృత్యాలు, కరాటే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విజేతలైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ బహుమతులు అందించారు. కార్య క్రమంలో లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శాశ్వత సుదర్శన హోమానికి విరాళం

అంతర్వేది, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):నవనారసింహ క్షేత్రాల్లో ప్రముఖమైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో నిత్యం నిర్వహించే స్వామివారి నారసింహ సుదర్శన హోమానికి ఆదివారం శాశ్వత విరాళంగా హైదరాబాద్ షేక్‌పేటకు చెందిన అవసరాల సూర్యబయ్యన్న పంతులు, కుటుంబ సభ్యులు రూ.లక్ష అందించారు. విరాళ దాతలకు ఆలయ ఏసీ వి.సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.విజయసారథి, పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వాహనాల వేలం వాయిదా

ఆలమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో పలు కేసుల్లో సీజ్ చేసిన వాహనాల వేలాన్ని వాయిదా వేసినట్లు ఆలమూరు సీఐ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. నేడు వాహనాలను వేలం వేసేందుకు నిర్ణయించగా అనివార్య కారణాలతో వేలాన్ని వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

వరి పొలాలకు బీటలు

• పామర్రులో సాగు నీరందక రైతుల ఆందోళన • క్రాస్‌బండలు వేసి పంటలను రక్షించాలని డిమాండ్

కె.గంగవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. వంతులవారీ విధానంలో కాలువల శివారు భూములకు నీరందడంలేదు. వారంలో రెండు రోజులు మాత్రమే వంతు ఉంటుంది. మిగిలిన రోజుల్లో కనీస మట్టంలోను నీరు సరఫరా కావడం లేదు. దీంతో కాలువల శివారు పొలాలున్న రైతులు పంటలను ఏవిధంగా రక్షించుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు వరి పొలాలు పొట్టదశకు చేరుకున్నాయి. ఈ దశలో నీరు ఎక్కువ మొత్తంలో మొక్క తీసుకుంటుందని, తగినంత నీరు అందించకపోతే దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని యండగండి, కూళ్ల, కోటిపల్లి, యర్రపోతవరం నీటి సంఘాల పరిధిలో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట నీటి సమస్య తలెత్తుతోంది. యండగండి నీటి సంఘం పరిధిలోకి వచ్చే పామర్రు లంక పొలాల్లో నీరు లేక పొలాలు బీటలు తీస్తున్నాయి. రైతుల ఆందోళనతో నీటి సంఘం అధ్యక్షుడు అడపా శ్రీను ఆదివారం పామర్రులోని లంక పొలాలను వారితో కలిసి పరిశీలించారు. బీటలువారిన పొలాలను పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలువకు ప్రత్యేక వంతు కేటాయించి నీరందిస్తామని రైతులు ఆందోళన చెందవద్దని చెప్పారు. ఇరిగేషన్ అధికారులు మురుగు కాలువలకు క్రాస్ బండ్‌లు వేసి మోటార్లతో పొలాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.



పామర్రులో బీటలువారిన పొలం. పక్క చిత్రంలో రైతుల పరిస్థితిని తెలుసుకుంటున్న నీటి సంఘం అధ్యక్షుడు శ్రీను

మంత్రివర్యా పట్టించుకోండి: కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ నియోజకవర్గంలో నెలరోజులుగా సాగునీటి ఎద్దడితో రైతులు ఆందోళనలు చెందుతున్నారు. ఇప్పటికే కె.గంగవరం మండలంలో యండగండి, పేకేరు, కోటిపల్లి, కూళ్ల, దంగేరు నీటి సంఘాల పరిధిలో సాగునీటి ఎద్దడితో రైతులు ఆందోళన బాట పట్టారు. సాగునీటి సమస్య తీవ్రత, రైతుల ఒత్తిడితో రైతు సంఘాల అధ్యక్షులూ ఆందోళనకు దిగారు. ఈనెల 2న కోటిపల్లి ఇరిగేషన్ కార్యాలయంలో కోటిపల్లి డీసీ అధ్యక్షుడు దాట్ల విజగోపాల్‌బాబు, నీటి సంఘాల అధ్యక్షులు ములకల విశ్వేశ్వరరావు, గోపు సతీష్, తాడాల లోవరాజు తదితరులు సమావేశం అయ్యారు. అధికార పక్షం సభ్యులు అయి ఉండి అధికారులను ముట్టడించినంత హడావుడి చేశారు. వంతు లేని సమయంలో కనీసస్థాయిలో నీరు విడుదల చేయకుండా లాకులు మూసివేయడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆందోళన చేశారు. ఇంత జరుగుతున్నా స్థానిక మంత్రి సుభాష్ వారి సమస్యపై దృష్టిపెట్టినట్టు లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా పంటలకు నీరు అందించి తమ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



ర్యాలి జగన్మోహిని కేశవస్వామికి వెండి వస్తువులు అందిస్తున్న దృశ్యం

కేశవస్వామికి వెండి వస్తువుల బహూకరణ

ఆత్రేయపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన సుంకర హరినాథ్, సత్యవతి దంపతులు 11.900 గ్రాముల వెండి మువ్వల మొలతాడును స్వామివారికి ఇచ్చారు. అన్నప్రసాద ట్రస్టుకు రూ.10,116 లు అందించారు. దాతలకు ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి స్వామివారి చిత్రపటం అందించారు.



బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం

రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

ద్రాక్షారామ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వేగాయమ్మపేటలో గతనెల 22న శుభకార్యానికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరఫున రెండోసారి ఆర్థికసాయం అందించారు. ఆదివారం ఫౌండేషన్ చైర్మన్‌తో పాటు కూటమి నాయకులతో బాధితుల నివాసాలకు వెళ్లి పరామర్శించారు. ఆదివారం గాయపడిన 11 మందిని సత్యంతో పాటు, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కూటమి నాయకులు పరామర్శించారు. బాధితులకు 11 మందికి గతంలో ఇచ్చిన 3 వేలు కాకుండా మరో రూ.7 వేలు చొప్పున వారికి అందించారు. కార్యక్రమంలో ఆళ్ల బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర బీసీ ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుత్తుల

ఆలమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ, ఓబీసీ ఉద్యోగుల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆలమూరుకు చెందిన గుత్తుల వీరబ్రహ్మం ఎన్నికయ్యారు. అన్నవరంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి బీసీ, ఓబీసీ ఉద్యోగుల సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆలమూరు మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీరబ్రహ్మంను ఎన్నుకున్నారు. ఈయనతోపాటు నూతన కార్యవర్గ ఎన్నికలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ఉద్యోగులను నాయకులుగా ఎన్నుకున్నారు. రాష్ట్ర బీసీ ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వీరబ్రహ్మంను పలువురు నాయకులు, ఉద్యోగులు అభినందించారు.

నేడు ఈ క్రాప్ పబ్లికేషన్

కె.గంగవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలో రబీ పంట ఈ క్రాప్ నమోదు వివరాలను ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పబ్లికేషన్‌కు ఏర్పాట్లు చేశామని మండల వ్యవసాయశాఖ అధికారి బలుసు రవి తెలిపారు. మండలంలోని 26 గ్రామాల్లో 11857 రైతులకు చెందిన 15,794 ఎకరాల్లో పంట నమోదు చేశామని చెప్పారు. సోమవారం రైతు సేవా కేంద్రాల్లో పబ్లికేషన్ చేయనున్నట్లు ఆయన అన్నారు. రైతులు వాటిని సరి చూసుకుని మార్పులు, చేర్పులు ఉంటే సచివాలయ వ్యవసాయ సహాయకులను సంప్ర దించాలన్నారు. ఈనెల 22న తుది జాబితా ప్రకటిస్తామని ఆయన తెలిపారు.



రామాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేగుళ్ల, ఎమ్మెల్సీ తోట తదితరులు

విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు

మండపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం పాలతోడు గ్రామంలో వున్న శెట్టిబలిజ కాలనీలో నిర్మించిన లక్ష్మీగణపతి, సీతారాములు, అంజనేయస్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఆలయ ప్రారంభానికి శాననసభ్యుడు వేగుళ్ల జోగేశ్వరరావు, వైసీపీ నేత ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి తదితరులు హాజరయ్యారు. ఆలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో వారు పాల్గొని పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన నేతలను స్థానికులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో మండపేట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, పిల్లా తాతాలు, కర్రి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

హిందూ ఆలయాల పక్కన మద్యం షాపును తొలగించాలి

కొత్తపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కొత్తపేట బోడిపాలెం వంతెన సమీపంలో నాలుగు హిందూ దేవాలయాలు ఉన్నాయని వాటిని ఆనుకుని ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. ప్రతిరోజూ అధిక సంఖ్యలో మహిళలు ఈ గుడులకు వెళ్లి పూజలు చేస్తారని వారు తెలిపారు. ప్రతిరోజూ రద్దీగా ఉండే ఆ ప్రదేశంలో గుడులకు ఆనుకుని మద్యం షాపు ఏర్పాటు చేయడం వల్ల మందుబాబులు చేసే ఆగడాలకు మహిళలు, భక్తులు ఇబ్బందులు పడతారని వారు తెలిపారు. ఆదివారం ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయనికి వారు వినతిపత్రాన్ని అందించారు. అధికారులు ఈ షాపును తొలగించకపోతే ప్రజలతో కలిసి త్వరలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.



ఎక్సైజ్ సీఐ కాత్యాయనికి వినతిపత్రాన్ని ఇస్తున్న దృశ్యం



కొత్తపేట మండల పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యోగా పోటీలు

కొత్తపేటలో జిల్లాస్థాయి యోగా పోటీలు

కొత్తపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కొత్తపేట మండల పరిషత్ ప్రాంగణంలో శ్రీకృష్ణ దేవరాయల వేదికలో ఆదివారం వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో యోగా పోటీలు నిర్వహించారు. సుమారు వంద మంది యోగా విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. యోగా మాస్టర్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను స్టేట్ యోగా పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించాలని తద్వారా ఏకాగ్రతత ఎంతో పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పి.కృష్ణకామేశ్వర్, ఓటేటి గంగాధరరావు, మారిశెట్టి సత్యనారాయణ, నల్లా గోపి, సూరవరపు సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కమ్మ మహాజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మండపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండపేట కమ్మ మహాజన సంఘ కార్యవర్గ ఎన్నిక ఆదివారం పట్టణంలో వున్న రెడ్డి వెంకయ్య కమ్మ మహాజన సభ భవనంలో జరిగింది. సంఘ భవనంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా రెడ్డి రాధాకృష్ణ, ఎంపీఎస్ పాఠశాల డైరెక్టర్ వల్లూరి చిన్నారావు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘ గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త వీవీవీఎస్. చౌదరి(మాదవి బాబు,) మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వి.విజయానంద పార్థసారథి, రెడ్డి అమర్‌నాథ్‌లను ఎన్నుకున్నారు. వారితోపాటు సంఘ ఉపాధ్యక్షుడిగా రెడ్డిపుల్లాజీ చౌదరి, మల్లిపూడి గణేశ్వరరావు, కోశాధికారిగా వల్లూరి రామన్నచౌదరి, కార్యవర్గ సభ్యులుగా యాలమాటికోండ, చుండ్రు పవన్, కొప్పాక సత్యనారాయణ, వేగుళ్ల పాపయ్య, పాలచర్ల బ్రహ్మాజీ చౌదరి, ములకల రామకృష్ణ, చుండ్రు అగస్త్యరాజ్ ఎన్నికయ్యారు.



నూతనంగా ఎన్నికైన కమ్మ మహాజన సంఘం నూతన కార్యవర్గం సభ్యులు



బహుమతి అందుకుంటున్న అబ్బులు

రాష్ట్రస్థాయి కర్రసాములో అబ్బులు ప్రతిభ

ఆలమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పోతురు ఏసీఎంఈ స్కూల్ వద్ద భారత రక్ష మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో సీనియర్స్ విభాగంలో కలవచర్లకు వీఆర్వో తాతపూడి అబ్బులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారు. రాష్ట్రస్థాయి కర్రసాములో ప్రథమస్థానంలో నిలిచిన అబ్బులును రాష్ట్ర అధ్యక్షుడు సి.ఆదినారాయణ, కార్యదర్శి డి.అశోక్‌బాబు, ఆర్గనైజర్ డీఎస్‌సీ క్రిష్టఫర్ తదితరులు అభినందించారు.



పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అరుణ

అభివృద్ధి పనుల పరిశీలన

ద్రాక్షారామ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో జరుగుతున్న అభివృద్ధి పనులను సర్పంచ్ కొత్తపల్లి అరుణ ఆదివారం పరిశీలించారు. పీహెచ్‌సీ వద్ద జలజీవన్ మిషన్‌లో నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించారు. పీహెచ్‌సీ ఆవరణలో మెండు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగుల సౌకర్యార్థం నిర్మిస్తున్న భవన నిర్మాణం, రథం వీధిలో నిర్మిస్తున్న డ్రైను, రోడ్డు పనులు పరిశీలించారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

ద్రాక్షారామ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం శివారు యల్లంపంపులో ఆదివారం సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. కోదండరామాలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం అన్నదానం జరిపారు. సీతారాములను వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, మాజీ ఏపీఐడీబీఐ డైరెక్టరు శ్యామ్, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంపీటీసీ కె.వెంకటేశ్వరి, మాజీ ఎంపీపీ పి.శ్రీనివాస్, శెట్టిబలిజ సంఘం నాయకులు ఎస్.ఏడుకొండలు, కోదండ రామాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు జనసేన సమావేశం

మండపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి) జనసేన మండపేట నియోజకవర్గ ఆత్మీయ సమావేశం నేడు జరుగుతుందని ఆ పార్టీ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ తెలిపారు. సూర్య కన్వెన్షన్ హాలులో జరిగే సమావేశానికి జన సైనికులంతా హాజరుకావాలని తెలిపారు.



వాటర్ ప్లాంటు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ

కె.గంగవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న సోమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఆలయంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కాకినాడ కోరమండల్ సంస్థను వాటర్ ప్లాంటు నిర్మాణం చేయాలని కోరారు. దీంతో ఆదివారం కంపెనీ జనరల్ మేనేజర్ పి.పద్మనాభం తదితర ప్రతినిధులతో వచ్చి భూమిపూజలో పాల్గొన్నారు. తాడాల నరసింహ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులతో ఆలయానికి అందించిన స్థలంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే

మండపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి) మండపేటలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల మరణించిన టి.దుర్గబాబు, కొనగళ్ల సూర్యప్రభ, రిమ్మలపూడి అన్నపూర్ణ, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సి.సతీష్, గుత్తుల సత్తిబాబు, వాదా ప్రసాదరావు, పాలచర్ల శిరీష్, వాకచర్ల గుప్తా, మేడింటి సూర్యప్రకాష్ తదితరులు వున్నారు.